క్లుప్తంగా

కరాటే సెలక్షన్స్‌ను వినియోగించుకోండి

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ సమైఖ్య ఆధ్వర్యంలో జరిగే కరాటే సెలక్షన్స్‌ను విద్యార్థులు ఉపయోగించుకోవాలని స్కూల్ గేమ్స్ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తాడేపల్లి పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన అండర్-14, అండర్-16 వయసు కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని, తాడేపల్లి పట్టణ, మండలానికి సంబంధించి కుంచనపల్లిలోని అరవింద స్కూల్‌లో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాల కోసం 8142541065 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



మంగళగిరి: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బుధవారం నగరంలోని ఎస్ఎల్ఎం చైతన్య, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, పెదవడ్లపూడి విజేత హైస్కూలులోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అధికారులు పర్యవేక్షించారు.

బీపీఎల్-23 విజేత బాప్టిస్ట్ రాయల్ జట్టు



మంగళగిరి: నగరంలోని బాప్టిస్ట్‌పేటలో జరిగిన బీపీఎల్ – 23 క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని బాప్టిస్ట్ రాయల్ జట్టు కైవసం చేసుకుంది. గత కొద్ది రోజులుగా జరిగిన మ్యాచ్‌లలో ఫైనల్‌కు చేరిన బాప్టిస్ట్ వారియర్స్ జట్టు, బాప్టిస్ట్ రాయల్ జట్లు బుధవారం జరిగిన మ్యాచ్‌లో హోరా హోరీగా తలబడ్డాయి. టాస్ గెలిచిన రాయల్స్ జట్టు ఫీల్డింగ్ చేపట్టగా బ్యాటింగ్ చేపట్టిన వారియర్స్ జట్టు 4 వికెట్లు నష్టానికి 87 పరుగులు సాధించింది. 88 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్స్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 88 పరుగులతో విజయం సాధించింది. టోర్నమెంట్ నిర్వాహకులు విజేతలకు మెమొంటోలను బహూకరించి, టోర్నమెంట్‌లో పాల్గొన్న ఆరు జట్లుకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

నందివెలుగు రోడ్డులో రాకపోకలపై ఆంక్షలు

తెనాలిరూరల్: వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర తెనాలి మండలంలో గురువారం నిర్వహించనున్న నేపథ్యంలో నందివెలుగు మీదుగా వాహన రాకపోకలపై ఆంక్షలు విధించినట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి తెలిపారు. ఉదయం 11 గంటల్నుంచి తెనాలి-విజయవాడ, తెనాలి-గుంటూరు వయా నందివెలుగు వెళ్లే వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

బైక్ అపహరణ

తెనాలిరూరల్: బైక్ అపహరణకు గురవడంపై కేసు నమోదైంది. నందులపేటకు చెందిన చైతన్యకృష్ణ గత నెలలో తన బైక్‌ను మార్కెట్‌ఏరియాలోని స్నేహితుడి రూమ్‌లో పెట్టి హైదరాబాద్ వెళ్లాడు. రెండు రోజుల అనంతరం తిరిగి రాగా వాహనం లేదు. ఇన్నాళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను బుధవారం ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి ఐతానగర్ హయ్యరుపేట తాడిబోయిన వారి వీధిలో పేకాటాడుతున్నారన్న సమాచారంతో టూ టౌన్ సీఐ ఎస్.వెంకట్రావు నేతృత్వంలో ఎస్ఐ టి.రమేష్‌బాబు, సిబ్బంది బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.52,400, సెల్‌ఫోన్లు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

28న పంపాతీరం నవలపై చర్చ

తెనాలి: ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా రచించిన పంపాతీరం నవలపై ఈనెల 28న కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చర్చా కార్యక్రమం నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఏర్పాటయే సభకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. ప్రసిద్ధ సంపాదకురాలు ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో ప్రతినెలా ఓ పుస్తకంపై చర్చా కార్యక్రమంలో భాగంగా జరిగే చర్చలో రచయిత్రి ఓల్గాతో పాటు ప్రముఖ కవి, కవిత సంపాదకుడు బండ్ల మాధవరావు, విరసం అరసవిల్లి కృష్ణ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ పిల్లి వాసు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- 113 త్యాళ్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న తీరు పరిశీలిస్తున్న కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: ప్రజాసంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెరసురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని 113త్యాళ్లూరు గ్రామంలో బుధవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. కత్తెరసురేష్ కుమార్ పాల్గొని వైద్యపరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. ఎన్నిరకాల మందులు అందజేస్తున్నారు. ఎంత మంది హాజరైన విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను రుచిచూశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నట్లు తెలిపారు. తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని సీఎంగా పదవి చేపట్టిన తరువాత వారి కష్టాలు తీర్చేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కుల, మత, పార్టీలు అనే భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. 14ఏళ్ల పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత చంద్రబాబు సెంటుభూమి కూడా పేదలకు ఇవ్వలేదని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రం వచ్చి ప్రజలను మభ్యపెట్టేందుకు మాయమాటలు చెబుతారని ప్రజలు వాటిని నమ్మొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ప్రజలకు మెడికల్ కిట్లు, కళ్లపరీక్షలు చేయించుకున్నవారికి కళ్లజోళ్లు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచ్ చుక్కా రూతు, ఎంపీటీసీ చేవూరి నాగవేణి, రామమోహన్‌రెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, పాలపాటి రఘు, చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఇజ్రాయిల్, నాగరాజు, వెంకట్రావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, చినచెంచు, ఎంపీడీఓ అనూరాధ, ఈవోపీఆర్డీ నిర్మలలక్ష్మి, కార్యదర్శి సత్యానంద్, వైద్యులు యానీ గ్రేస్, శాంతి, మేఘన, భీమేష్‌నాయక్, సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, కె.సుదర్శనరాజు పాల్గొన్నారు.

రాయపూడిలో ..



రాయపూడిలో వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

రాయపూడి(తాడికొండ): దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా జన నీరాజనాలు పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులను పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టనన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన జగనన్న దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాడన్నారు. ప్రధానంగా పేదవాడికి నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, నూతన విధానాలు ఇతర రాష్ట్రాలు సైతం అమలు చేసేందుకు ఆలోచన చేస్తున్నాయంటే జగనన్న దార్శనిక పాలన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. బాబు ఎన్ని డ్రామాలాడినా ప్రజలు ఆయనను ఎప్పటికీ నమ్మరని ఎన్నికలు ఎప్పుడొచ్చినా మరో 50 సంవత్సరాలు జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధులకు కళ్లజోళ్లు, రోగులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, ఎంపీడీఓ బి.శ్రీమన్నారాయణ, ఎంఈఓ గద్దె కోటేశ్వరరావు, కార్యదర్శి శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాపయారాధ్యుల విగ్రహావిష్కరణ



అమరావతి: సుమారు రెండు వందల ఏళ్ళ కిందట అమరావతి రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గురువు, ఆస్థాన పండితుడు బాలచాముండేశ్వరీదేవి ఉపాసనతో అమ్మవారి సాక్షాత్కారం పొందిన ములుగు పాపయారాధ్యుల విగ్రహాన్ని స్థానిక యోగాశ్రమంలో బుధవారం ఆవిష్కరించారు. ధాన్యకటక విహారట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు, పొన్నూరు భావన్నారాయణ సంస్కృత కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ నిష్టల సుబ్రమణ్యం చేతుల మీదుగా పాపయారాధ్యుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ బాలచాముండేశ్వరీదేవి నక్షత్ర మాలికా స్తోత్రం, శ్రీ దేవి భాగవతపురాణాన్ని తెలుగులోకి అనువదించిన మహనీయుడు పాపయారాధ్యుడన్నారు. అలాగే సంస్కృతాంధ్రములలో అనేక కావ్యాలను రచించిన మహా పండితుడన్నారు. డాక్టర్ నిష్టల సుబ్రమణ్యంను యోగాశ్రమ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కలువకొలను నరసింహమూర్తి, గ్రామ ఉపసర్పంచ్ నిమ్మా విజయసాగరబాబు, యోగాశ్రమ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



పాత గుంటూరు: సంపత్‌నగర్ శ్రీ శారదా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని బుధవారం అమ్మవారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, కళాకారుల నత్యాలు, కోలాట ప్రదర్శనతో నగరంలోని ప్రధాన వీధుల్లో అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబరు 3న పాఠశాలల్లో సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలి టౌన్: పాఠశాలల్లో నవంబరు 3న స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలో మాంటిస్సోరి స్కూల్లో బుధవారం సర్వేకు ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ తెనాలి మండలంలో 3,6,9 తరగతుల విద్యార్థులను పరీక్షించేందుకు 46 స్కూల్స్‌ను ఎంపిక చేయడం జరిగిందన్నారు. సర్వే ప్రకారం మండల స్థాయి రిపోర్టులను తయారు చేస్తారని వివరించారు. అసెస్‌మెంట్ వర్క్ ప్రకారం విద్యార్థులను సన్నద్ధం చేయాలని హెచ్ఎంలకు సూచించారు. ఎంఈఓ- 2 జయంత్‌బాబు మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఈవీఎస్, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు ఉండవని, కేవలం లిటరసీ, న్యూమరసీ తరగతి సస్థాయి గణితం, లాంగ్వేజ్‌లలో మాత్రమే సర్వే నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రైవేట్, ప్రభుత్వ, ఎయిడెడ్, కేంద్ర ప్రభుత్వ అన్ని రకాల పాఠశాలల్లో సర్వే ఉంటుందన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యావనరుల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం



మంచాల(చేబ్రోలు): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేబ్రోలు మండలం మంచాలలో బుధవారం కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కనకదుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేబ్రోలులోని ముట్లూరు రోడ్డులో 19వ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా భవానీ భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఘనంగా గ్రామోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులు కోలాహలంగా కొమ్మమూరు చానల్‌లో నిమజ్జనానికి తరలివెళ్లారు.

తొమ్మిది మందికి యాంజియోగ్రామ్


బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ మెడ్ స్టార్ ఆస్పత్రిలో నిర్వహణ



వైద్యచికిత్స కోసం వచ్చిన గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: గుండెపోటు రాక మునుపే, ముందు జాగ్రత్తగా వైద్య పరీక్షలు చేయించుకోగలిగితే చాలా వరకు ప్రాణాపాయం నుంచి నివారించవచ్చునని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం గుండవరం, గొడవర్రు గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన వైద్యశిబిరం ద్వారా యాంజియోగ్రామ్ పరీక్షలు అవసరమైన తొమ్మిది మందికి మొదటి విడతగా బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్ స్టార్ వైద్యశాలకు బుధవారం తరలించారు. వీరిలో గుండె సమస్య ఉన్న ముగ్గురికి స్టంట్ కూడా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వేయించనున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. మానసికంగా ధైర్యంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకుంటే, ఆరోగ్య శ్రీ పథకం వెన్నంటి ఉండి, ఆర్థిక భరోసా ఇచ్చి ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని గ్రామస్తులకు అంబటి మురళీకృష్ణ చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నడుస్తున్న సంక్షేమ పాలన, ప్రభుత్వంపై గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ మరింతగా పెరిగేందుకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

కళలతో మనిషికి అలౌకిక ఆనందం



లక్ష్మీపురం: కళలు మనిషికి అలౌకిక అందాన్ని అందిస్తాయని సంగీత విద్వాంసుడు పి.మొగిలి తెలిపారు. ఆరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడుతూ కళలు గతానికి వర్తమానానికి వారధివంటివని, వాటిని పరిరక్షించాలని కోరారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణ మాట్లాడుతూ వ్యక్తి సృజనాత్మకశక్తి కలిగి ఉంటే అది బహుముఖాలుగా విస్తరిస్తుందన్నారు. దీనికి ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుడు పికా సో ఉదాహరణగా పేర్కొన్నారు. ఆయన కవిగా, నాటక రచయితగా కూడా పేరొందారని గుర్తు చేశారు. ఆయన జయంతినే అంతర్జాతీయ కళాకారుల దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

పట్నంబజారు: ఆలయంలో అమ్మవారి బంగారు కళ్లు అపహరించుకు పోయిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పాత గుంటూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోకి బుధవారం తెల్లవారుజామున దుండగులు ప్రవేశించి అమ్మవారి బంగారం కళ్లు అపహరించుకు పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు పాత నేరస్తుడు చోరీకి పాల్పడినట్లు గుర్తించినట్లు సమాచారం.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేటకు చెందిన కుంచాల భార్గవ్ భార్య బాలకోటేశ్వరి అతడితో విభేదించి మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కోటేశ్వరి తల్లి రమాదేవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసీ పరిరక్షణ యూనియన్ బాధ్యత

తెనాలి: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, తెనాలి శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో నిర్వహించారు. సౌత్ సెంట్రల్ జోన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ జి.కిశోర్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజల సంపదతో నిర్మించుకున్న ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీని కాపాడుకోవడం యూనియన్ ముఖ్యమైన బాధ్యతగా చెప్పారు. ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ మచిలీపట్నం నాయకులు డాక్టర్ కళాధర్, ఎన్ఎంకే ప్రసాద్, ఠాగూర్, చంద్రపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య, ఎంపీపీ స్వప్న రాజేష్

మేడికొండూరు: మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గత నెలలో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు తీసుకున్న లక్ష్యాలను ఏ మేరకు పూర్తి చేశారన్న దానిపై సమీక్షించారు. ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు ప్రధాన సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు అధికారులు సమైక్యంగా పనిచేయాలన్నారు. ఇటీవల పేరేచర్లలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.1.86 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. పేరేచర్ల ఎంపీటీసీ వల్లెపు శ్రీను మాట్లాడుతూ గ్రామంలో స్మశానవాటిక స్థలం కోసం అధికారులు చుట్టూ తిరిగినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్థలం సమకూర్చేందుకు చర్యలు చేపడతామని అధికారులు హామీఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాస శర్మ, మండల అభివృద్ధి అధికారి ప్రభాకరరావు, ఈఓపీఆర్డీ రవికుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేసుకున్న ఓ వ్యక్తికి సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కును బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్ మాట్లాడుతూ ఇటీవల చిలువూరు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించే చిలువూరు శెవిరి అనారోగ్యానికి గురికావడంతో శస్త్రచికిత్స నిర్వహించారు. ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో పేదవాడైన శెవిరి సీఎం సహాయనిధిని అందించాలని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డిని కోరగా, స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే సీఎం సహాయ నిధికి సిఫార్సు చేయగా రూ.35 వేలు మంజూరు అయ్యాయి. ఆ చెక్కును శెవిరికి అందజేశామని తెలిపారు. నాయకులు నెమలికంటి బిచ్చురావు, సిహెచ్ ఫిలోమినీ, తురకా మోహన్‌దాస్, 5వ వార్డు సచివాలయ కన్వీనర్ మధుబాబు, షేక్ హసామ్ అహమ్మద్, సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

నూర్‌బాషా సింహగర్జనను జయప్రదం చేయండి



నూర్‌బాషా సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

తాడేపల్లిరూరల్: ఏపీ నూర్‌బాషా (దూదేకుల) సంఘం సింహగర్జన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘ కార్యదర్శి షేక్ ఖాజావలి అన్నారు. బుధవారం తాడేపల్లి నులకపేటలో నూర్‌బాషా (దూదేకుల) సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ గుంటూరులోని పొన్నూరు రోడ్‌లో గల ముస్లిం కాలేజీలో జరిగే ఏపీ రాష్ట్ర నూర్‌బాషా (దూదేకుల) సంఘం సింహగర్జన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘ కోశాధికారి షేక్ మస్తాన్, నాయకులు షేక్ బాషా, మందడం మేస్త్రి, షేక్ ఖాసిం, షేక్ నజీర్, షేక్ సైదు హుస్సేన్, జాన్ సైదా, మీరావలి, బాజీ పాల్గొన్నారు.

దుగ్గిరాల ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల ఇరిగేషన్ 'డి' కార్యాలయం వద్ద వామపక్ష నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌కు వెంటనే నిధులు కేటాయించి, రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలన్నారు. వర్షాలు లేకపోవడం, ప్రభుత్వం కాలువల ద్వారా సరిపడా నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, ఇంజిన్ల ద్వారా పొలాలకు నీరు పెట్టాలంటే చాలా ఖర్చు అవుతోందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం హై లెవల్ చానల్ ద్వారా పొలాలకు సరిపడా నీరు విడుదల చేయాలన్నారు. హైలెవల్ చానల్ పోరాట కమిటీ కన్వీనర్, కో-కన్వీనర్ ఎం.శివసాంబిరెడ్డి, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావులు మాట్లాడుతూ కౌలు రైతులు ఎకరాకు ముందుగా రూ.20 వేలు కౌలు డబ్బులు చెల్లించి, మరో రూ.20 వేలు పెట్టుబడి పెట్టి ఉన్నారని, ఈ పరిస్థితుల్లో నీరు అందక పొలాలు ఎండిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారన్నారు. అఖిలపక్ష రైతు సంఘ, హై లెవల్ చానల్ పోరాట కమిటీ నాయకులు, రైతులు, కౌలు రైతులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీల్లో నారాకోడూరు విద్యార్థి ప్రతిభ



డేవిడ్‌రాజును అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె. డేవిడ్‌రాజు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలుర విభాగంలో అక్టోబర్ 7 నుంచి 9వ తేదీ వరకు కడపలో రాష్ట్ర జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో డేవిడ్ రాజు ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. నవంబర్1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జమ్ము కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొననున్నాడు. శ్రీనగర్‌కు బయలుదేరుతున్న డేవిడ్‌రాజును హెచ్‌ఎం, స్కూల్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాంగణ ఎంపికల్లో కళ్లం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఉమాశంకర్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పన లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్ రెడ్డి తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు ఐదుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఏడాదికి రూ. 5 లక్షల వార్షిక వేతనంతో సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధికల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, డాక్టర్ ఇర్షాద్, శ్యామలాదేవి అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

పట్నంబజారు: నగరంలోని కొత్తపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ ఈనెల 4న మృతి చెందిన కానిస్టేబుల్ ఎం.కిశోర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈస్ట్ సబ్ డివిజన్‌కు సంబంధించి కొత్తపేట, లాలాపేట, పాత గుంటూరు సిబ్బంది, అధికారులు ముందుకు వచ్చి అందజేసిన రూ. 2,05,616ల చెక్కును ఏఎస్పీ నిచికేష్ షలేఖే ఆయన కార్యాలయంలో కానిస్టేబుల్ కిశోర్ భార్య సుధారాణికి అందజేశారు.